ఆంధ్రజ్యోతి


గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY

యాదాద్రి
భువనగిరి

5

గురువారం 25 సెప్టెంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.60 (303.4310)	3,66,816	3,66,816
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.62 (4.10)	11,124.26	10,376.32
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	167.320 (34.6755)	3,68,435	3,82,670

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

జీతం రాలే..

పండుగ చేసుకునేదెలా?

- దసరాకు చేతిలో చిల్లిగవ్వలేక దిగాలు
- ఎన్నికల నోటిఫికేషన్ వస్తే జీతం ఎలా..



మండుటెండలో చేతులకు బొబ్బలు వచ్చేలా కష్టపడిన కూలీలకు వేతనాలు సకాలంలో అందడంలేదు. కుటుంబ పోషణలో కాసింత ఆసరా, అవసరాలకు సొమ్ము అక్కరకు వస్తుందన్న ఆశతో పనులకు వెళ్లిన కూలీలకు నిరాశే మిగులుతోంది. నెలానెలా చెల్లించాల్సిన జీతాలు, ప్రతీ రెండు వారాలకు ఓసారి చెల్లించాల్సిన ఉపాధి కూలి డబ్బులు నెలలు గడిచినా అందక ఇబ్బందిపడుతున్నారు. కూలీలకు పనులు కల్పించిన క్షేత్రస్థాయి సిబ్బందికి సైతం మూడునెలల వేతనాలు పెండింగ్‌లో కొనసాగుతుండడంతో దసరా పండుగకు చేతిలో చిల్లిగవ్వలేక దిగాలుపడి చూస్తున్నారు. దసరా పండుగ లోపు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న వేతనాలు తమ బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారా..? లేదోనన్న సందిగ్ధం నెలకొంది.

7

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్, అడ్డగూడూరు, మర్రిగూడ)

చౌటుప్పల్‌కు

అదనపు కోర్టు మంజూరు

- పోస్టులు, నిధుల మంజూరుకు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు



చౌటుప్పల్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనం

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్‌కు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టును హైకోర్టు మంజూరుచేసింది. ఇందుకు సంబంధించి పోస్టులు, జీతా భత్యాలు, ఫర్నిచర్, గ్రంథాలయం తదితర ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ 2025 ఆగస్టు 6న రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ జనరల్ ఎస్.గోవర్ధన్‌రెడ్డి లేఖ రాశారు. చౌటుప్పల్ బార్ అసోసియేషన్ చేసిన విన్నపంతోపాటు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అందించిన సిఫారసు లేఖను అనుసరించి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టుకు హైకోర్టు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న జూనియర్ సివిల్ జడ్జికోర్టులో పెండింగ్ కేసులు రోజు రోజుకూ పెరిగిపోతుండడంతో అదనపు కోర్టు ఏర్పాటు ఆవశ్యకతను హైకోర్టు గుర్తించింది. అదనపు కోర్టు ఏర్పాటుతో కక్షిదారులకు సత్వర సేవలు అందడంతోపాటు ప్రస్తుతం ఉన్న కోర్టుపై భారం తగ్గనుంది. ఈ కోర్టు పరిధిలో చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, సంస్థాన్‌నారాయణ పురం మండలాలున్నాయి. చౌటుప్పల్ మండలం 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఉండడంతో రోడ్డు ప్రమాదాలు, డ్రంకెన్ డ్రైవ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులు అధికంగా ఉంటున్నాయి. ఈ నెల 13న నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఈ-చలాన్ కేసులు 10,500 పరిష్కరించబడ్డాయి. ఈ కోర్టు పరిధిలో కేసుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అదనపు కోర్టుతోపాటు సబ్‌కోర్టును ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత కూడా ఎంతగానో ఉంది. ఈ కోర్టు ఏర్పాటుకోసం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్యం వెంకటాచలపతి ఆధ్వర్యంలో న్యాయవాదులు పోరాటం సాగిస్తున్నారు.

కావాలసిన పోస్టులు

జడ్జి -1, సూపరింటెండెంట్ 1, స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, జూనియర్ అసిస్టెంట్లు 3, టైపిస్టులు 2, ఫీల్డ్ అసిస్టెంట్‌లు 2, ఎగ్జామినర్ 1, కాపీస్ట్ 1, ప్రాసెస్ సర్వర్లు 3, రికార్డు అసిస్టెంట్ 1, అటెండర్లు 3, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఒక పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ప్రతిపాదనలు పంపించింది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి జీతాలు రూ.2.19కోట్లు, కాంటిన్‌జెన్సీ ఎక్స్‌పెన్‌డీచర్ రూ.3లక్షలు, లైబ్రరీ అండ్ ఫర్నీచర్ కొనుగోలుకు రూ.5లక్షలు కేటాయించాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



8

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. యాదగిరిగుట్ట క్షేత్రంలో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు.

చేపా.. చేపా..

ఎందుకు పెరగట్లే

- నిర్లక్ష్యం నీడన 'ఇండ్లకోటయ్యగూడెం' మత్స్య బీజ క్షేత్రం
- చేప పిల్లల ఉత్పత్తి అంతంత మాత్రమే
- పట్టించుకోని అధికారులు

6

పాడిరైతులకు

బిల్లులు చెల్లించాలి



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

- అఖిల భారత రైతుకూలీ సంఘం

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా పాడి రైతులకు రావాల్సిన మదర్ డెయిరీ బిల్లులను వెంటనే చెల్లించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి, ఏవో జగన్మోహన్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదర్ డెయిరీలో అవసరం లేకున్నా రూ.లక్షల జీతాలు తీసుకుంటున్న కొందరు ఉద్యోగులున్నారని, వారికి బదులు గేదెలను సాకి పాలు పోసే రైతులను ఆదుకోవాలన్నారు. డెయిరీ ఆస్తులను విక్రయించాలనే ఆలోచన మాని, రైతులను ఎలా కాపాడుకోవాలో నిర్ణయించాలన్నారు. పాడిరైతుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

పరిషత్..
పంచాయతీలో..

ఏది ముందు





- స్థానిక సంస్థల ఎన్నికలపై నేతల్లో సందిగ్ధం
- తొలుత పరిషత్ ఎన్నికలే వస్తాయని జోరుగా ప్రచారం

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఈ వారాంతంలోగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో..., ఆ లోగానే నోటిఫికేషన్ జారీచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

ముందుగా జిల్లా, మండల పరిషత్ ఎన్నికలా? సర్పంచ్ ఎన్నికలను నిర్వహిస్తారా? అన్న అంశంపై స్థానికంగా రాజకీయ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వం సంకేతాలను పరిశీలిస్తే ముందుగా పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాజకీయ నేతల్లో చర్చ మొదలైంది. పార్టీల గుర్తులపై ఎన్నికలు జరుగనుండటంతో మెజార్టీ స్థానాలను పార్టీపరంగా గెలుచుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని శక్తిగా ఎదగాలని అధికార పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో మొత్తం 17 జడ్పీటీసీ స్థానాలు, 178 ఎంపీటీసీలు, 427 సర్పంచ్, 3,704 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచు, వార్డు సభ్యుల, జడ్పీటీసీ, ఎంపీటీసీల రిజర్వేషన్ల ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాయంత్రాంగం పూర్తి చేసింది. మంగళవారం రాత్రివరకు కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, డీపీవో, డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఇతర సిబ్బంది ఆయా స్థానాలకు కులాల వారీగా రిజర్వేషన్లపై కసరత్తు పూర్తిచేశారు. జనాభా దామాషా, రొటేషన్ విధానంలో అన్ని స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మండలాలవారీగా రిజర్వేషన్ల వివరాలతో కూడిన నివేదికను సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు. ప్రస్తుతం ఖరారు చేసిన రిజర్వేషన్లకు ప్రభుత్వం జీవో జారీ చేసిన తర్వాత మహిళలు, పురుషుల వారీగా కేటాయించనున్నారు.

42శాతం బీసీ రిజర్వేషన్‌తో రాజకీయ లబ్ధి

స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేస్తోంది. ప్రభుత్వం మరింత గడువు కోరాలని చూస్తూనే, మరోపక్క ఎన్నికల నిర్వహణకూ సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తుది ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలు ప్రకటించింది. తొలుత పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు ఆసక్తి చూపుతుండటంతో తాము పోటీ చేయదలుచుకున్న స్థానంలో రిజర్వేషన్ ఎలా ఉంటుందనే విషయంపై స్పష్టత లేక ఆశావాహులు సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, కుల గణనలో ఉన్న బీసీ జనాభా వివరాలు, ఎస్సీ, ఎస్టీ జనాభా సమాచారం. వార్డులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాల వారీగా ఇవ్వనున్నారు. ఆ లెక్కల ఆధారంగా రిజర్వేషన్ చేపట్టనున్నారు. రొటేషన్ పద్ధతిలో సీట్లు కేటాయించనుండటంతో గత ఎన్నికల్లో ఉన్న రిజర్వేషన్ కేటగిరి ఈసారి ఉండదు. అందుకని రిజర్వేషన్లు మొదటినుంచి నేతల్లో దడ పుట్టిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశావహుల తలరాత దీనిపై ఆధారపడి ఉంది. రిజర్వేషన్ల స్థానాల కేటాయింపుపై రాజకీయ పార్టీల నేతలు ఉత్కంఠతతో

మిగతా 8వ పేజీలో..

కబ్జాకు గురైన చెరువులను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలను పరిశీలించి, కబ్జాకు గురైన వాటిని గుర్తించాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన నీటి పారుదల, రెవెన్యూ శాఖ అధికారులతో చెరువుల రక్షణపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని చెరువులను సర్వేచేసి బఫర్ జోన్‌లో జరిగిన నిర్మాణాలను గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువులు, కుం టల విస్తీర్ణం రికార్డుల మేరకు ఉండి బఫర్ జోన్లు కబ్జాకు గురైతే చర్యలు తీసుకోవాలన్నా రు. చిన్నచిన్న కుంటలను కబ్జాచేసి లేఅవుట్లు చేస్తున్నారని ఫిర్యాదుల వస్తున్నాయని, ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో సర్వే చేపట్టి కబ్జాకు గురయితే చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు కలెక్టరేట్‌లో కోఆపరేటీవ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, జిల్లా ఇరిగేషన్ అధికారి నర్సింహ, డీఈఈలు లావణ్య, మైథిలీ, రాజవర్ధన్‌రెడ్డి, ఏఈఈలు లింగస్వామి, మమత, శిరీష, మధు, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగవంతం చేయాలి

యాదగిరిగుట్ట రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని మాసాయిపేటలో రాత్రి 7గంటలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇసుక విషయంలో ఇబ్బంది ఉందా? ఇటుక, సిమెంట్, స్టీలు ధరలు ఎలా ఉన్నాయో ఆరా తీశారు.

రైతులకు నీటి కష్టాలు తొలగినట్లే

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



కాచారంలో చెరువుకు పూలు సమర్పిస్తున్న విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరుణుడి కరుణతో రైతులకు సాగునీటి కష్టాలు తొలగినట్లేనని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం మండలంలోని కాచారం గ్రామచెరువు రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు నిండి అలుగు పారుతుండటంతో చెరువువద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వర్షాలు సరిగ్గా కురువకపోవడంతో రిజర్వాయర్ నుంచి చెరువులు నింపామని, ఈ సారి ఆలేరు ప్రజల మీది కరుణతో వరుణుడు భారీవర్షాలు కురిసి చెరువులు అలుగు పోస్తున్నాయన్నారు. ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని, కొంతమంది రాజకీయ లబ్ధికోసం యూరియా కొరత ఉన్నట్లు సమస్యను సృష్టించి రైతులు, ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సన్నబియ్యం, రుణమాఫీ, ఉచిత కరెంట్ వంటి సక్షేమ పథకాల అమలు చూసి ఓర్వలేక ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయడం కోసమే ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, పార్టీ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ఎడ్ల సుగుణరాంరెడ్డి, నాయకులు దుంబాల వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసమే 'స్నేహ'

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యువతులు, మహిళల భద్రత వారికి అవసరమైన పోషకాహారం, ఆర్థిక సాధికారతతోపాటు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడమే స్నేహ (సేఫ్టీ, న్యూట్రీషన్, ఎమ్‌పవర్‌మెంట్, హెల్త్ ఫర్ అడోల్సెంట్) లక్ష్యంగా అమలు అవుతుందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్‌రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన స్నేహ కార్యక్రమంపై జిల్లాస్థాయి అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామంలో 15-18 సంవత్సరాల మధ్యగల 5 నుంచి 15 మంది సభ్యులతో స్నేహ సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. పోషకాహారం, మధ్యలో నిలిచిపోయిన విద్యను తిరిగి కొనసాగించి ఉపాధి అవకాశాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ నెలలో కనీసం రెండుసార్లు సమావేశాలు నిర్వహించి వారికి భద్రత, ఆరోగ్యం, పోషకాహారం, బాల్య వివాహాల నిర్మూలన, సామాజిక అంశాలపై క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాస్థాయి సమన్వయ కమిటీలో జిల్లా గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్య, వైద్య శాఖలు, పోలీస్ పంచాయతీరాజ్, కార్మిక శాఖలు పాల్గొంటాయని తెలిపారు. అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్నేహ కార్యక్రమం జరిగే ప్రతీగ్రామంలో పోలీస్ అధికారి హాజరై అవసరమైన సూచనలు చేస్తారని, మహిళల భద్రతకు కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు, ఎస్సీ సంక్షేమాధికారి శ్యాంసుందర్, ఉపాధి కల్పనాధికారి సాహితీ, డీఐఈవో రమణి, డీఎంహెచ్‌వో మనోహర్, డీవైఎస్‌వో ధనుంజనేయులు, అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, మెప్మా పీడీ రమేష్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

కేంద్రం వెంటనే

జీఎస్టీని ఎత్తివేయాలి

భువనగిరి గంజ్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్, గ్యాస్, బంగారం, వెండిపై జీఎస్టీ వెంటనే ఎత్తివేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 350 పైచిలుకు వస్తువులపై జీఎస్టీ తగ్గించినట్లు గొప్పలు చెబుతోందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గిస్తేనే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు. తులం బంగారం రూ.లక్షపైనే పలుకుతోందని, మూడు నాలుగేళ్లుగా నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోయిందన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, పట్టణ కార్యవర్గ సభ్యులు బండెల ఎల్లయ్య, నాయకులు వల్దాస్ అంజయ్య, దండు గిరి, కొత్త లక్ష్మయ్య, బురుగు పద్మ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి



ఏసీపీని సన్మానిస్తున్న యాజమాన్యం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని చౌటుప్పల్ ఏసీపీ పి.మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం 'యాంటీ ర్యాగింగ్'పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది విద్యార్థుల భవిష్యత్‌కు మాత్రమే కాకుండా సమాజంపై సైతం ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడకూడదని, డ్రగ్స్, గంజాయి, సిగరెట్స్ ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే భవిష్యత్ బాగుంటుందన్నారు. ర్యాగింగ్, డ్రగ్స్, సైబర్ క్రైంపై సమాచారం అందించేందుకు టోల్‌ఫ్రీ నెం.1930 లేదా 100లను సంప్రదించాలన్నారు. అనంతరం ఏసీపీని సన్మానించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుబ్బారావు, ఎస్ఐ కె.భాస్కర్‌రెడ్డి, యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ వెంకటేశం మారగోని, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాల్సిందే

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య



సంస్థాన్‌నారాయణపురం మండలంలో త్రిపుల్‌ఆర్ నిర్వాసితులతో మాట్లాడుతున్న వీరయ్య

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పెద్దల ప్రయోజనాలకోసం చిన్న రైతులను బలిచేసే విధంగా నిబంధనలకు విరుద్ధంగా తెచ్చిన త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య డిమాండ్‌చేశారు. సంస్థాన్‌నారాయణపురం మండలం శేరిగూడెం, పుట్టపాక, చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెం, తూర్పుగూడెం, సింగరాయిచెరువు గ్రామాల్లో బుధవారం వీరయ్యతోపాటు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, ఇతర నాయకులు పర్యటించారు. భూనిర్వాసితులతో మాట్లాడారు. రోడ్డులో కోల్పోయే భూములను పరిశీలించారు. మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో వీరయ్య మాట్లాడారు. అలైన్‌మెంట్‌ను కుదించటం సరికాదన్నారు. జిల్లాలో చిన్న, సన్నకారు రైతులకు చెందిన 3వేల ఎకరాలకు పైగా కోల్పోవాల్సి వస్తుందన్నారు. పెద్దల ప్రయోజనాలను కాపాడేందుకు పేద రైతులను బలి చేయడం సరికాదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రైతులను మోసం చేయటంలో పోటీ పడుతున్నాయన్నారు. త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని, తప్పని పరిస్థితిలో భూములు తీసుకోవాల్సి వస్తే భూమికి భూమిని, లేదా మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 27న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, గుంటోజు శ్రీనివాసాచారి, గంగదేవి సైదులు, దోడ యాదిరెడ్డి, దొంతగోని పెద్దులు, పల్లె పుష్పారెడ్డి, పల్లె పుల్లారెడ్డి, బద్దుల వెంకటయ్య, ఐతరాజు గాలయ్య, తుమ్మల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చేపా.. చేపా.. ఎందుకు పెరగట్లే..



క్షేత్రంలో వృథాగా ఉన్న పాండ్





నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఇండ్ల కోటయ్యగూడెం వద్ద ఉన్న బీజోత్పత్తి క్షేత్రంలోని చేపలు 'చేపా చేపా ఎందుకు పెరగట్లే అంటే పట్టించుకునే వారేరని అంటున్నట్లు ఉన్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విస్తారమైన భూమి, నీటి వనరులు ఉన్నా ఈ క్షేత్రం నిర్వహణ అధ్వానంగా మారడంతో తమకు ఈ పరిస్థితి దాపురించిందని చేపలు మొరపెట్టుకున్నట్లే ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. నర్సరీల్లో మాత్రమే ఏదో మొక్కుబడిగా పిల్లలను పెంచుతున్నారు. కానీ పాండ్స్ వృథాగా ఉంటున్నాయని, దీంతో ఈ క్షేత్రం మత్స్యకారులకు ఎలాంటి చేయూతనివ్వడం లేదని వారంటున్నారు.

● నిర్లక్ష్యం నీడన 'ఇండ్లకోటయ్యగూడెం' మత్స్య బీజ క్షేత్రం
● చేప పిల్లల ఉత్పత్తి అంతంతమాత్రమే ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి-నిడమనూరు)
మత్స్యసంపదను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం తుమ్మడం శివారు ఇండ్లకోటయ్యగూడెం గ్రామంలో 1990లో 75 ఎకరాల విస్తీర్ణంలో మత్స్య బీజ క్షేత్రం ఏర్పాటుచేసింది. 2.5 కోట్ల చేపపిల్లలు ఉత్పత్తి చేసేందుకు అవసరమైన 20 నర్సరీలు, 38 పాండ్స్ నిర్మించింది. ఉత్పత్తి చేసిన చేపపిల్లలను జిల్లాలోని మత్స్య సొసైటీల ద్వారా చెరువుల్లో వదిలి మత్స్య సంపదను అభివృద్ధి చేయడంతో పాటు మత్స్యకారులకు దోహదం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయితే మొదట్లో ఇక్కడ ఉత్పత్తి చేసిన చేపపిల్లలను చుట్టుపక్కల మండలాల్లోని చెరువుల్లో వదిలే వారు. కానీ గత ప్రభుత్వం మత్స్య బీజ క్షేత్రం నిర్వహణను వరంగల్ జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ ఏజెన్సీకి లీజుకు అప్పగించింది. కానీ మూడేళ్ల పాటు ఇక్కడ ఎలాంటి ఉత్పత్తి చేపట్టలేదు. అనంతరం అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు లీజు రద్దు చేయించారు. దీంతో ఇటీవలి ప్రభుత్వమే దీనిని నిర్వహిస్తోంది.

ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు

నల్లగొండ జిల్లాలో 249 మత్స్య సహకార సొసైటీలు పనిచేస్తున్నాయి. ఇండ్లకోటయ్యగూడెం మత్స్య బీజ క్షేత్రంలో లక్ష్యం మేరకు చేప పిల్లలు ఉత్పత్తి చేస్తే సొసైటీల పరిధిలోని చెరువులకు చేపపిల్లలు పంపిణీ చేయవచ్చు. మత్స్యకారులకు కూడా చేయూతనిచ్చేందుకు ఎంతో కొంత దోహదపడుతుంది. కానీ క్షేత్రం నిర్లక్ష్యానికి గురికావడంతో చెరువుల్లో వదిలేందుకు సరిపడా చేపపిల్లల ఉత్పత్తి లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి పిల్లలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. చెరువుల్లో ఎంతమేరకు వదులుతున్నారో తెలియని పరిస్థితి ఉంది. అధికారులు మాత్రం లక్షల సంఖ్యలో పిల్లలను వదులుతున్నట్లు చెబుతున్నారు. చేపపిల్లల కొనుగోలులో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని సొసైటీల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మత్స్య సొసైటీ సభ్యులు కూడా నష్టపోతున్నారు.

30 లక్షల చేపపిల్లల ఉత్పత్తి

మత్స్య బీజ క్షేత్రంలో చేపపిల్లల ఉత్పత్తి విషయంలో కూడా పొంతనలేని సమాధానాలు వినిపిస్తున్నాయి. సరైన వివరణ ఇచ్చేవారే కరువయ్యారు. ఈ ఏడాది 30 లక్షల మేరకు చేపపిల్లలను ఉత్పత్తి చేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నా అక్కడ ఎలాంటి చేపపిల్లల సీడ్ కనిపించడం లేదు. మూడు కోట్ల మేరకు పిల్లలను ఉత్పత్తి చేసేందుకు అవసరమైన నర్సరీలు ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా నర్సరీలు, పాండ్స్ వృథాగా ఉంటున్నాయి.



ప్రహరీ కూడా సరిగా లేని మత్స్యబీజ క్షేత్రం

వేధిస్తోన్న సిబ్బంది కొరత

మత్స్య బీజ క్షేత్రాన్ని సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇక్కడ ఎఫ్‌డీవోతో పాటు కొందరు సిబ్బంది ఉండాల్సి ఉన్నప్పటికీ అక్కడ ఎవరూ ఉండటం లేదు. కేవలం ఫిషర్‌మెన్, ఫీల్డ్‌మెన్ మాత్రమే ఉంటున్నారు. కనీసం వాచ్‌మెన్ కూడా లేదు. సరైన సిబ్బంది లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం తదితర కారణాల మూలంగా క్షేత్రం నిరుపయోగంగా కనిపిస్తుంది. క్షేత్రం నిర్వహణను భువనగిరి మత్స్యశాఖ ఏడీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కానీ ఆయన ఇంతవరకు క్షేత్రాన్ని సందర్శించిన దాఖలాలు లేవు. పర్యవేక్షణ లేకపోవడంతో మత్స్య బీజ క్షేత్రానికి చెందిన 75 ఎకరాల భూమిలో కొంత ఆక్రమణకు గురవుతోంది. ప్రస్తుతం 63ఎకరాల వరకు మాత్రమే ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా క్షేత్రం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పలువురు వాపోతున్నారు. పలువురు మద్యం తాగడం, పేకాట ఆడటం జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. చేపపిల్లలను ఉత్పత్తి చేసి సొసైటీలకు సరఫరా చేసి చెరువుల్లో వదిలేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సొసైటీల బాధ్యులు కోరుతున్నారు. కాగా మత్స్య బీజ క్షేత్రం నిర్వహణపై అధికారుల వివరణ కోరేందుకు వెళ్లగా అక్కడ ఎవరూ అందుబాటులో లేరు. ఫోన్‌లో కూడా సంప్రదించేందుకు ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రాలేదు.

నాణ్యమైన చేపపిల్లలు ఉత్పత్తి చేయాలి

ఇండ్లకోటయ్యగూడెంలోని మత్స్య బీజ క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నిర్వహణకు సరిపడా నిధులు కేటాయించాలి. నాణ్యమైన చేపపిల్లలు ఉత్పత్తి చేసి చెరువులకు పంపిణీ చేయాలి. మత్స్యకారులకు మేలు చేసేలా మత్స్య బీజ క్షేత్రాన్ని నిర్వహిస్తే మత్స్యకారులకు ప్రయోజనం ఉంటుంది.

ఎం.వెంకటయ్య, మాజీ మత్స్య సహకార సంఘం చైర్మన్, నిడమనూరు.

పోలీసులపై దాడి ఘటనలో 14మంది అరెస్టు



హుజూర్‌నగర్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ , సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీలో పోలీసులపై దాడిచేసిన ఘటనలో 14 మంది యూపీ, బీహార్ కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. హాజీ ఏపీ బావా అండ్ కో కంపెనీ ద్వారా డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ నివాసి వినోద్ ఈ నెల 21వ తేదీన గుండెపోటుతో మృతిచెందాడు. అతని కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఈ నెల 22వ తేదీన ఉత్తర్‌ప్రదేశ్, బీహార్‌కు చెందిన పలువురు కార్మికులు ఉదయం 10గంటల సమయంలో డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ మెయిన్ గేట్ వద్ద బైఠాయించారు. ఫ్యాక్టరీలోకి ఎవరినీ వెళ్లనివ్వకుండా, బయటకు రానివ్వకుండా ధర్నా చేశారు. సిమెంట్ పరిశ్రమ ఇచ్చిన సమాచారంమేరకు పాలకవీడు ఎస్ఐ కోటేష్ సంఘటనా స్థలానికి చేరుకుని యాజమాన్యంతో కూర్చుని మాట్లాడుకోవాలని కార్మికులకు సూచించారు. ధర్నా చేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ముఖేష్‌ప్రసాద్, మంజిత్‌కుమార్, మన్సూర్‌అలం, శక్తి చౌహాన్, రవిశంకర్‌సహానీ, ధనుంజయ్, కమలేష్‌యాదవ్, ఉమేష్‌కుమార్‌యాదవ్, బీహార్‌కు చెందిన భానుపొల్దార్, విక్రమ్‌కుమార్, అభిషేక్ కుమార్, రాహుల్‌కుమార్, మన్సూర్‌అన్సారి, సచిన్‌విశ్వకర్మ గ్రూప్‌గా ఏర్పడి ఎస్ఐ, పోలీసు సిబ్బందిపై కర్రలు, రాళ్లతో దాడిచేశారు. కార్మికుల దాడిలో పోలీస్ వాహనం అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎస్ఐ కోటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం పాలకవీడు సమీపంలోని విష్ణుపురం రైల్వేస్టేషన్ వద్ద ఎ-1, ఎ-4 నిందితులను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులు తెలిపిన వివరాల ప్రకారం ఎ-6 నుంచి ఎ-15 వరకు నేరస్తులను పట్టుకుని వారి వద్ద ఉన్న కర్రలను స్వాధీనం చేసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. పరారీలో ఉన్న ఎ-5 నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న పెట్రోల్ బంకు సిబ్బంది



బాధితుడికి బ్యాగ్‌ను అందజేస్తున్న పోలీసులు, బంకు మేనేజర్, సిబ్బంది

హాలియా, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెట్రోల్ బంక్‌లో దొరికిన రూ.2 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు కలిగిన బ్యాగ్‌ను పోలీసులకు అందజేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా హాలియాలో బుధవారం జరిగింది. ఏఎస్ఐ యాదయ్య, బంక్ మేనేజర్ పోషబోయిన లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 22న పెద్దవూర మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తవిటి బ్రహ్మచారి పెట్రోల్‌బంక్‌లోకి ద్విచక్రవాహనంపై వచ్చి పెట్రోల్ పోయించుకున్నాడు. అనంతరం బంక్‌లో ఉన్న గాలి మిషన్‌లో గాలి చెక్‌చేసుకునే సందర్భంలో బైక్‌పై ఉన్న బ్యాగ్‌ను పక్కన పెట్టి వెళ్లిపోయాడు. అది గమనించిన సిబ్బంది బ్యాగ్‌ను మేనేజర్ లింగయ్యకు అప్పగించగా వారు బ్యాగులో ఉన్న వివరాల ఆధారంగా బ్రహ్మచారిని అని గుర్తించి విషయాన్ని హాలియా పోలీసులు తెలిపారు. బుధవారం పోలీస్ సమక్షంలో రూ.2 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాల గల బ్యాగ్‌ను బ్రహ్మచారికి అందజేశారు. దీంతో బ్రహ్మచారి వారికి కృతజ్ఞతలు తెలిపారు. నిజాయితీ చాటుకున్న బంకు మేనేజర్ లింగయ్య, సిబ్బందిని పోలీసులు, పురప్రముఖులు అభినందించారు. కార్యక్రమంలో మండలి చినలింగయ్య, రాంబాబు తదితరులు ఉన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ దగ్ధం

గరిడేపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంగళవారంరాత్రి ఓ బేకరి దుకాణం పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు భూక్యా నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం గడ్డిపల్లి గ్రామంలో పదేళ్లుగా నాగరాజు బేకరి దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగా దుకాణం మంగళవారం రాత్రి మూసివేసి ఇంటికి వెళ్లాడు. 12గంటల సమయంలో దుకాణం నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు తెలపడంతో షట్టర్ తీసి చూసే సరికి మొత్తం దుకాణం దగ్ధమైంది. ప్రమాదంలో ఫర్నీచర్‌తో పాటు తినుబండారాలు, కాలిపోయి సుమారు రూ.5లక్షల విలువైన నష్టం వాటిల్లినట్లు నాగరాజు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన కోరారు.

పల్లె ప్రకృతి వనం బోర్డు చోరీ



ప్రకృతి వనంలోని ఆర్చి చోరీ కోసం స్తంభాలను కోసిన దొంగలు (రౌండప్‌లో)

దామరచర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని రాజగట్టు గ్రామంలో పల్లె ప్రకృతివనం బోర్డు బుధవారం తెల్లవారుజామున చోరీకి గురైంది. వనంలోని ఇనుపపైపులతో ఏర్పాటుచేసిన బోర్డును బ్లేడ్ సహాయంతో కట్ చేసి మంగళవారం రాత్రి ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు.అధికారులు స్పందించి చోరీకి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకుని పల్లె ప్రకృతి వనానికి పూర్తిస్థాయిలో రక్షణ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు.

బైరవునిబండలో శతాధిక వృద్ధురాలు మృతి



రామక్క(ఫైల్)

శాలిగౌరారం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం బైరవునిబండ గ్రామంలో 103 ఏళ్ల శతాధిక వృద్ధురాలు ఈదులకంటి రామక్క అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. ఈమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా పెద్దకుమారుడు చనిపోగా, చిన్నకుమారుడు గ్రామంలోనే వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. రామక్కకు 15మంది మనమళ్లు, మనమరాళ్లు ఉన్నారు.

చందాలకు ప్రత్యామ్నాయంగా లక్కీడ్రా ఆఫర్

● దేవీశరన్నవరాత్రోత్సవాల కోసం చౌడంపల్లి యువసేన వినూత్న నిర్ణయం ● మొదటి ప్రైజ్ మేక(గొర్రె)పొట్టేలు

వరుసగా పట్టుచీర, మందు, నాటుకోడిపుంజు



చౌడంపల్లి యువసేన దసరా లక్కీ డ్రా ఆఫర్ బ్రోచర్

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చందాలు వసూలు చేసి ఉత్సవ వేడుకలకు ఖర్చు చేయడం ద్వారా గ్రామస్తుల నుంచి విమర్శలకు తావివ్వకూడదనుకున్న నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చౌడంపల్లికి చెందిన ఉత్సవ కమిటీ వినూత్నంగా ఆలోచించింది. చౌడంపల్లి యువసేన ఆధ్వర్యంలో గణేశ్, దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులే చందాలు వేసుకుని దుర్గామాత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అయితే చందాలు వసూలు చేసి మొహమాటపడేకన్నా లాటరీ పెట్టి డబ్బులు సమకూర్చుకోవాలని ఆలోచించారు. తమ ఆలోచనను కార్యాచరణలో పెట్టారు. దసరా నవరాత్రి లక్కీ డ్రా ఆఫర్‌ను ప్రకటించారు. మొదటి ప్రైజుగా గొర్రె(మేక)పొట్టేలు, ద్వితీయ బహుమతిగా పట్టుచీర, తృతీయ బహుమతిగా ఫుల్(మద్యం) బాటిల్, నాలుగో బహుమతిగా నాటుకోడి పుంజును ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం సోషల్‌మీడియా ద్వారా విస్తృతప్రచారం చేశారు. ఒక్కోలాటరీ టికెట్ ధరను రూ.200లుగా నిర్ణయించారు. ఈ విధంగా సమకూరిన డబ్బుతో బహుమతులు ఇవ్వగా పోను మిగిలే డబ్బులతో గ్రామస్థులను ఆధ్యాత్మిక యాత్రకు తీసుకెళ్లాలని యోచిస్తున్నట్లు లక్కీ డ్రా ఆఫర్ రూపకర్తల్లో ఒకరు తెలిపారు.

వాగు దాటాలంటే భారీవాహనం కావాల్సిందే

● ఉధృతంగా ప్రవహిస్తున్న కోడూరు వాగు





కోడూరువాగును ట్రాక్టర్‌లో దాటుతున్న ప్రజలు, ఎక్స్‌కవేటర్‌లో ద్విచక్రవాహనాన్ని తరలిస్తున్న స్థానికులు

అర్వపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో భారీ వర్షానికి కోడూరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో కొమ్మాల, కోడూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కోడూరు వాగుపైన 12గొలుసు కట్టు చెరువులు ఉండటం, అవి అలుగులు పోస్తుండతో ఒకేసారి బుధవారం ఉదయానికి వాగుకు వరద పెరిగింది. దీంతో ప్రజలు నానాఇబ్బందులుపడ్డారు. ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ల సహాయంతో వాగును దాటారు. భారీవర్షాలు కురిసిన సమయంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కోడూరు గ్రామ ప్రజలకు అన్ని వైపులా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రజలు ఎటూపోయే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది కిందట వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించినా అడుగు ముందుకు పడలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మూసీకి కొనసాగుతున్న వరద ఉధృతి

కేతేపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. 10రోజులకుపైగా హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు మూసీ ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు భారీగా మూసీ రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో మంగళవారం నుంచి మూసీకి వరద పోటెత్తిన వరద ఉధృతి బుధవారం సైతం కొనసాగింది. మంగళవారం సాయంత్రానికి 12184.84 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో కొంతమేర తగ్గి బుధవారం సాయంత్రానికి 10376.32క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో మంగళవారం ఎత్తిన తొమ్మిది క్రస్ట్‌గేట్లలలో రెండింటిని మూసివేసిన అధికారులు 2, 3, 4, 7, 8, 10, 12 నెంబరు క్రస్ట్‌గేట్లను రెండు అడుగులు ఎత్తి మొత్తం 10679.56 క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు 384.48క్యూసెక్కుల సాగునీటిని కలిపి 11124.26క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.62అడుగులు(4.10టీఎంసీ)లుగా ఉంది.

భర్త కోసం అత్తింటి ముందు బైఠాయింపు



పెళ్లి ఫొటోతో ఆందోళన చేస్తున్న మమత

భువనగిరిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో చదువుకుంటూ వ్యాపారం చేస్తున్నానని నమ్మించి వివాహం చేసుకున్న భర్త పట్టించుకోకపోవటంతో భార్య అత్తింటిముందు బైఠాయించింది. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో ఈ సంఘటన జరిగింది. కామారెడ్డి జిల్లాకు చెందిన బంటారం నాగయ్య, మంగ దంపతులు హైదారాబాద్‌లోని దమ్మాయిగూడలో స్థిరపడ్డారు. వీరికి కుమార్తె మమత, కుమారుడు ఉన్నారు. డిగ్రీ పూర్తయిన కుమార్తెకు వివాహం చేయాలని నిర్ణయించుకుని ఆమె ఫొటో సహా వివరాలను 2023 సెప్టెంబరులో ఓ మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో పోస్టుచేశారు. అదే సమయంలో భువనగిరికి చెందిన వస్త్రవ్యాపారి లెంకలపల్లి సురేష్ తన కుమారుడికి వివాహం చేసేందకు అదే మ్యాట్రిమోనీలో వివరాలు పోస్టు చేశాడు. ఈ క్రమంలో వస్త్ర వ్యాపారి కుమారుడు మణిదీప్ ఆ యువతితో మాటలు కలిపి నీవు మా కుటుంబ సభ్యులందరికీ నచ్చావ్, నేను అమెరికాలో చదువుకుంటూ వ్యాపారం చేస్తున్నానని, నమ్మబలికి పెళ్లికి ఒప్పించాడు. దీంతో ఇరు కుటుంబాల అంగీకారంతో వరకట్నం చెల్లింపులతో 2023 డిసెంబరు 9న హైదరాబాద్‌లో సంప్రదాయరీతిలో కులాంతర వివాహం జరిగింది. మరుసటి రోజు భువనగిరిలో వివాహ విందు కూడా నిర్వహించారు. వివాహమైన 10 రోజులకు మణిదీప్ అమెరికాలోని టెక్సాస్‌కు వెళ్లిపోయాడు. త్వరలోనే అమెరికాకు తీసుకువెళ్తానని భార్య మమతకు చెప్పాడు. కానీ అక్కడికి వెళ్లాక భార్య ఫోన్ కాల్స్, చాటింగ్‌కు స్పందించలేదు. దీంతో వధువు అత్తింటికి ఫోన్ చేసినప్పటికీ స్పందన కరువైంది.

భర్త కోసం అమెరికాకు పయనం..

వివాహానికి ముందే మమతకు అమెరికా వీసా ఉండటంతో, మణిదీప్ చెప్పిన చిరునామా ఆధారంగా గత ఏడాది నవంబరు 4వ తేదీన మమత అమెరికా వెళ్లింది. ఆమె వస్తున్న సమాచారం తెలుసుకున్న మణిదీప్ భార్యను విమానాశ్రయంలో కలుసుకుని ఐదుగురు మిత్రులతో కలసి ఉంటున్న సింగిల్ బెడ్‌రూమ్ ఇంటికి తీసుకెళ్లాడు. అందరూ కలసి ఇదే ఇంటిలో ఉండాలంటూ ఒత్తిడి చేశాడు. కొద్ది రోజుల అనంతరం మిత్రులు వెళ్లిపోవడంతో దంపతులిద్దరూ ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో సతమతం

అమెరికాలో ఉంటున్న మమత దంపతులకు ఎదురైన ఆర్థికఇబ్బందులతో ఆమె అక్కడికి సమీపంలోని ఓ తెలుగు కుటుంబం ఇంటిలో పనికి కుదిరింది. ఈ నేపథ్యంలో తొమ్మిది నెలల పాటు చేసిన పనికి వచ్చే వేతనం తనకే ఇవ్వాలంటూ భర్త గొడవపడేవాడు. ఇదిలా ఉండగా అక్కడి లేబర్ యాక్ట్ ప్రకారం ఆరు నెలలకు ఒకసారి ఇచ్చే 20రోజుల సెలవులు లభించాయి. దీంతో మమత ఈ ఏడాది ఆగస్టు 21వ తేదీన హైదరాబాద్‌కు వచ్చింది. తిరిగి వెళ్లేందుకు 15రోజుల అనంతరం భర్తకు పలుమార్లు ఫోన్లు చేసినా స్పందన రాలేదు. దీంతో అక్కడి అతడి మిత్రులకు ఫోన్ చేయగా మమత హైదారాబాద్ వెళ్లిన మరుసటి రోజే మణిదీప్ భువనగిరి వెళ్లాడని చెప్పారు. ఆమె అత్తింటికి ఫోన్ చేయగా డిప్రెషన్‌తో అనారోగ్యానికి గురై ఇంటికి వచ్చాడని చెప్పారు.

అత్తారింటికి వెళ్లినా...

భర్త మణిదీప్ భువనగిరికి వచ్చాడని తెలుసుకున్న మమత తల్లి, సోదరుడితో కలిసి అత్తారింటికి వెళ్లింది. అయితే వారు ఆమెను ఇంట్లోకి రానివ్వలేదు. పైగా నీవు మాకు నచ్చలేదు విడాకులు తీసుకుందామన్నారు. దీంతో ఆమె మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మహిళా పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కౌన్సిలింగ్‌కు రమ్మని అక్కడి పోలీసులు సమాచారం ఇచ్చినప్పటికీ భర్త కుటుంబం నిర్లక్ష్యం చూపింది. ఈ క్రమంలో నాలుగైదు పర్యాయాలు ఆమె భువనగిరికి వచ్చి అవమానాలకు, ఛీత్కారాలకు గురైంది. అలాగే ఇరు కుటుంబాల పెద్దమనుషులతో పలుమార్లు పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ పరిష్కారం లభించకపోవడంతో ఆమె తనకు భర్త కావాలంటూ కుటుంబసభ్యులతో కలిసి అత్తింటి ముందు బుధవారం రోజంతా బైఠాయించింది. అయితే కోడలు మమత చెప్పేదంతా అబద్ధాలు అని, తమ పరువు తీసేందుకు చేసిన పన్నాగమని, ఆమెనే ఇష్టపడి పెళ్లి చేసుకున్నా విడిపోయేందుకు భారీ మొత్తంలో డిమాండ్ చేస్తున్నారని అత్తింటి వారు ఆరోపిస్తున్నారు. అయితే దసరా అనంతరం ఇరు కుటుంబాలతో మాట్లాడుతామని పోలీసులు నచ్చచెప్పడంతో రాత్రి పొద్దు పోయాక ఆందోళనను విరమించారు.

వివాహానికి భారీగా కట్నం

మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో నచ్చి కుదుర్చుకున్న కులాంతర వివాహానికి భారీగా కట్నం ఇచ్చినట్లు మమత కుటుంబసభ్యులు పేర్కొన్నారు. వివాహ సమయంలో వరకట్నంగా వధువుకు 25తులాలు, వరుడికి 8తులాలు బంగారం, 4.50కిలోల వెండి, రూ.10లక్షలు ఇచ్చామని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. కామారెడ్డిలో భూవిక్రయంతో వచ్చిన నగదులో రెండు దఫాలుగా రూ.5లక్షల చొప్పున రూ.10లక్షలు చేబదులుగా అల్లుడి కుటుంబం తీసుకుందని ఆమె కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మాకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన యేసు

గరిడేపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలకేంద్రంలో బుధవారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రంలోని కోదాడ, మిర్యాలగూడ ప్రధానరహదారిపై గుండా లక్ష్మమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న యూటర్న్ వద్ద ఎలగోల యేసుకు ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. యేసు స్పృహ కోల్పోగా వెంటనే స్థానికులు 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. యేసు జీవనాధారం కోసం గరిడేపల్లిలో బస్తాల కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయం గురించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చలిగంటి నరేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అర్వపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నెల రోజుల కిందట సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపాడు గ్రామానికి చెందిన ఉప్పల అనిల్(30) ట్రాక్టర్ ఢీకొని గాయపడ్డాడు. అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కాగా ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

ఎనిమిది మంది జూదరుల అరెస్ట్

కనగల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని జీఎడవల్లి గ్రామశివారు వ్యవసాయ భూముల్లో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ.26,300 నగదును. 8 సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాట, కోళ్ల పందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట శిబిరాలు కొనసాగించే వారి సమాచారాన్ని పోలీసులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో పీసీలు మజీద్, లింగరాజు, సురేష్ తదితరులున్నారు.

గొర్రెల దొంగల ముఠా పట్టివేత

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గొర్రెల దొంగల ముఠాను పట్టుకున్నట్లు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట సీఐ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపారు. బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వంగపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కమాన్ సమీపంలో తనతో పాటుగా ఎస్ఐలు యాదయ్య, కృష్ణస్వామి సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా కరీంనగర్ జిల్లా కేశపట్నం గ్రామానికి చెందిన గొల్లెన కుమార్ అలియాస్ కుమారస్వామి, కింసారపు శేఖర్ అలియాస్ ఎండి అబ్దుల్‌రహన్‌లు మల్లాపురం గ్రామానికి చెందిన మోటే రమేష్ గొర్రెలను అపహరించి రెండు కార్లలో తరలిస్తున్నారు. అనుమానంతో పట్టుకొని వారి ప్రశ్నించగా సరైన సమాధానం లేకపోవడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడని వివరించారు. వారి వద్ద నుంచి 15 గొర్రెలు, రెండు కార్లు స్వాధీనం పర్చుకొని ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో కేసు నమోదు చేసి వారిని రిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

మెగా పేరెంట్స్ మీటింగ్ రేపు

నాంపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాంపల్లి ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఈ నెల 26న మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గందం మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అన్నపూర్ణాదేవిగా..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని రోజుకో విధంగా పూజిస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అమ్మవారిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు చేశారు.


వేములపల్లి మండలం లక్ష్మీదేవిగూడెంలో..


మఠంపల్లిలో..


చిట్యాల మండలంలో..


రామన్నపేట మండలం ఎల్లంకిలో..


దేవరకొండలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు

యాదగిరిగుట్ట ఆలయ ఇన్‌చార్జి ఈవోగా రవినాయక్



యాదగిరిగుట్ట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా గుగులోత్ రవినాయక్‌కు ప్రభుత్వం బుధవారం బాధ్యతలు అప్పగించింది. ఈమేరకు ఆయన గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ఈవో ఎస్.వెంకట్రావ్ వ్యక్తిగత పనుల నిమిత్తం నెల రోజుల పాటు విదేశీ పర్యటనకు వెళుతున్నారు. గతంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌గా రవినాయక్ పనిచేశారు.

విద్యార్థినులకు అభినందన


విద్యార్థినులను అభినందిస్తున్న ఐడీఎల్ యాజమాన్యం

మేళ్లచెర్వు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 35వ రాష్ట్రస్థాయి జూనియర్ మహిళా కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించిన స్కూల్ యాజమాన్యం. ఈ నెల 25, 26, 27తేదీల్లో నిజామాబాద్ జిల్లా ముక్తల్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలకు మండల కేంద్రంలోని ఐడీఎల్ హైస్కూల్‌కు చెందిన రోహిణి, కార్తిక, ఈ నెల 19వ తేదీ నుంచి 23వరకు కోదాడలో నిర్వహించిన క్యాంపులో ఉత్తమ ప్రదర్శన కనబర్చి సూర్యాపేట జిల్లా తరఫున ఎంపికైనందున పాఠశాల కరస్పాండెంట్ రమణకుమార్ ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు బసవయ్య, ఉపాధ్యాయులు రాజశేఖర్ అభినందించారు.

● జీతం రాలే!

పండుగ చేసుకునేదెలా?

● ఉపాధి వేతనాల కోసం కూలీల నిరీక్షణ ● ఉమ్మడి జిల్లాలో రూ.86కోట్ల వేతన బకాయిలు ● మూడునెలలుగా పెండింగ్‌లో ఎఫ్ఏల వేతనాలు

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మే నెల నుంచి జూలై నెలాఖరు వరకు కూలీల దినసరి వేతనాల చెల్లింపు ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని దాదాపు 12 లక్షల మంది కూలీలు తమ వేతనాలకోసం నెలల తరబడి నిరీక్షిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి స్థానికంగా పనులు కల్పించే ఉద్దేశంతో అమల్లోకి వచ్చిన ఉపాధిహామీ పథకం ద్వారా వేతనాల చెల్లింపు ప్రక్రియ ఏటా గాడి తప్పుతోంది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్)లో నమోదైన కూలీల హాజరు నమోదు ప్రక్రియ క్షేత్రస్థాయిలో పూర్తవుతున్నా సకాలంలో కూలీలకు వేతనాలు అందని దుస్థితి నెలకొంది. ఉద్యోగ సిబ్బంది సైతం వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. నిత్యం కూలీలతో మమేకమై పనులు కల్పించే ఫీల్డ్‌అసిస్టెంట్లకు మూడు నెలల వేతనాలు అందాల్సి ఉండగా, మండలస్థాయిలో పనిచేసే ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్లు(సీవో), ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు రెండు నెలల జీతభత్యాల చెల్లింపు ప్రక్రియ స్తంభించింది.

ఎన్నికల కోడ్ భయం

ఇప్పటికే ఐదునెలలుగా పెండింగ్‌లోపడిన దినసరి వేతనాలు ఎప్పటికీ వస్తాయోనన్న ఆందోళన గ్రామీణ ప్రాంత కూలీలతో పాటు, క్షేత్ర సహాయకుల్లో కనిపిస్తోంది. ఉపాధిహామీ పనులకు హాజరయ్యే కూలీల్లో అధికశాతం నిరక్షరాస్యులు కావడంతో తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక పడిగాపులు కాస్తున్నారు. కార్యాలయాలు, గ్రామాల్లో అందుబాటులో ఉండే సిబ్బందిని ప్రశ్నిస్తున్నప్పటికీ వారు సైతం దీనిపై స్పష్టత ఇవ్వలేక చేతులెత్తేస్తున్నారు. ఈనేపథ్యంలో కూలీలు తమ సమస్య పరిష్కారం కోసం ఎక్కడికి వెళ్లాలో.. ఎవరిని అడగాలో తెలియక మదనపడుతున్నారు. అయితే గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది కూలీల హాజరుశాతం గణనీయంగా పెరిగింది. జూలై నెలాఖరు వరకు గ్రామాల్లో వ్యవసాయ పనులు సక్రమంగా దొరక్కపోవడంతో చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు సైతం ఉపాధి హామీ పథకాన్ని ఆదరించారు. ఈ నేపథ్యంలో ఈ పథకం వినియోగం పెరిగి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య అధికమైంది. దీంతో ప్రతీ గ్రామ బడ్జెట్‌లో 80 నుంచి 90 శాతం పనులు సైతం ఇప్పటికే పూర్తయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే తమ వేతనాల పరిస్థితి ఏమిటని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.86 కోట్ల వేతన బకాయిలు

ఉమ్మడి జిల్లాలో 8,78,659 కుటుంబాలు ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు కలిగి ఉన్నాయి. ఆయా కుటుంబాలనుంచి 19,77,973మంది కూలీలుగా నమోదై ఉంటే 10,06,078 మంది పురుషులు, 9,71,895 మంది మహిళా కూలీలు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఉపాధి హామీ పథకాన్ని 11.08లక్షల మంది కూలీలు ఆదరించారు. పనులకు హాజరైన కూలీలకు ఈ ఏడాది మేనుంచి జూలై మాసాంతం వరకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఒక్కో కూలీకి సగటున ఏడునుంచి తొమ్మిది వారాల కష్టార్జితం పెండింగ్‌లో పడ్డాయి. మండుటెండలో చెమటోడ్చిన కూలీల వేతనాల చెల్లింపు ప్రక్రియలో తీవ్రజాప్యం చోటుచేసుకుంటోంది. ఇప్పటికే జిల్లాల్లో పనిదినాల వినియోగం తుదిదశకు చేరుకున్నప్పటికీ వేతనాలు మాత్రం పెండింగ్‌లోనే ఉండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో రూ.86కోట్ల పైచిలుకు వేతనాలు కూలీలకు అందాల్సి ఉంది. అందులో నల్లగొండ జిల్లాలో పనిచేసిన 5,12,082 మంది కూలీలకు రూ.38 కోట్లు బిల్లులు జమచేయాల్సి ఉండగా, అందులో రూ.7.68కోట్ల నిధులు, ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీవో) స్థాయిలో పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా సూర్యాపేట జిల్లానుంచి 3,94,818 మందికూలీలు ఉపాధి పనులకు హాజరుకాగా, రూ.27కోట్ల పైచిలుకు వేతన బకాయిలు ఉన్నాయి. అందులో రూ.2.67కోట్ల బిల్లుల చెల్లింపు ఎఫ్‌టీవో స్థాయిలోనే నిలిచిపోయాయి. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉపాధిహామీ పనులు చేసిన 2,01,953 మంది కూలీలకు చెందిన రూ.21కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉండగా, రూ.1.36కోట్ల బిల్లులు ప్రస్తుతం ఎఫ్‌టీవో పెడింగ్‌లో ఉన్నాయి. ఈజీఎస్ పథకానికి నిధుల విడుదల సరిపడా స్థాయిలో విడుదల చేయకపోవడంతోనే వేతనబకాయిలు నెలలతరబడి పెండింగ్‌లో పడుతున్నాయని అధికారవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



పండగ పూట పస్తులే

మర్రిగూడ, అడ్డగూడూరు: సాధారణంగా ఒక నెల జీతం రాలేదంటే ఉద్యోగులు ఇబ్బంది పడతారు. అదే మూడు నెలలపైగా రాలేదంటే వారి ఇబ్బందులు వర్ణనాతీతం. మర్రిగూడ మండలంలోని 18 గ్రామపంచాయతీల పరిధిలో 80 మంది (మల్టీ పర్పస్ వర్కర్స్‌గా, టెంపరరీ వర్కర్స్) పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరికి మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, జీతాలు రాక జీవనం సాగేదెలా? అని పండుగకు పస్తులే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డగూడూరు మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో 84 మంది మల్టీపర్పస్ కార్మికులుగా పని చేస్తున్నారు. ప్రసుత్తం గ్రామ పంచాయతీ కార్మికులకు నెలకు రూ.9,500 చెల్లిస్తున్నారు. ఈ వేతనాన్ని సకాలంలో ఇవ్వకపోవడంతో తమ కుటుంబాలను పోషించుకునేందుకు అవస్థలు పడుతున్నారని వారు అవేదన వ్యక్తం చేశారు.

తొమ్మిది వారాల కూలీ డబ్బులు రావాలి



ఈ ఏడాది మార్చి నుంచి ఉపాధిహామీ పథకం పనులకు వెళ్లాం. ఏప్రిల్ నెలాఖరు వరకు వేతనాలు చెల్లించి ఆ తర్వాత నిలిపివేశారు. మాకు రావాల్సిన దినసరి వేతనాల గురించి ఈజీఎస్ సిబ్బంది, అధికారులను అడిగితే సరైన సమాధానం రావడంలేదు. రెండువారాలకోసారి వచ్చే వేతనాలు ఐదునెలలైనా కూలీల ఖాతాలో జమకావడంలేదు. పోస్టాఫీసులు, బ్యాంకుల చుట్టూ తిరిగి ఆరాతీసి నిరీక్షిస్తున్నాం.

గొల్ల నాగరాజు, వేములపల్లి

పేదింటి బిడ్డకు జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న షేక్ షన్ను

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డకు ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారం లభించింది. గుడిపల్లి మండలకేంద్రానికి చెందిన షేక్ షన్ను నిఫా (ఎన్ఐఎఫ్ఏ- నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ ఆక్టివిస్ట్) జాతీయ స్థాయి పురస్కారం అందుకుంది. మంగళవారం ఢిల్లీలోని భారత మడపంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ అధిపతి ప్రీత్‌పాల్ సింగ్ షేక్ షన్నుకు అవార్డు అందజేశారు. గత కొన్నేళ్లుగా సమాజ సేవలో నిబద్ధతతో పని చేస్తూ వచ్చిన ఆమెకు ఈ గౌరవం దక్కింది. కాగా షేక్ షన్ను నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్)లో భాగంగా 2024 భారతదేశ రిపబ్లిక్ డే సెలెబ్రెషన్స్‌లో పాల్గొని కర్తవ్య పథ్ దగ్గర కవాతు చేసి ఎంతో మంది ఆడపిల్లలకు మనోధైర్యాన్ని నింపింది. షన్నుకు ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కిన సందర్భంగా కళాశాల అధ్యాపకులు, తల్లి షేక్ హసీనా, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

జాతీయ స్థాయి పోటీలకు నల్లగొండ క్రీడాకారులు

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడు రాష్ట్రం దిండిగల్ పట్టణంలోని క్రీడా మైదానంలో ఈనెల 25నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే 77వ సీనియర్, 44వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీలకు తెలంగాణ జట్టుకు నల్లగొండ జిల్లా నుంచి ఆర్. భవ్యశ్రీ(సీనియర్), ఆర్.శృతి, జస్వంత్, పి.చిన్ని ఎంపికయ్యారని బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి అవిశెట్టి బయ్యన్న ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు బుధవారం హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లారు. వీరిని పలువురు అభినందించారు.

సిమెంట్ నాణ్యతలో మైహోమ్‌కు బంగారు పతకాలు


అవార్డు అందుకుంటున్న మైహోమ్ ప్రతినిధులు

మేళ్లచెర్వు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సిమెంట్ తయారీలో నాణ్యత పటిష్టత విభాగంలో మైహోమ్ సంస్థకు రెండు బంగారు పతకాలు వచ్చాయని సంస్థ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం భారత ప్రభుత్వం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సిమెంట్ పరిశ్రమల్లో క్వాలిటీ విభాగంలో పనిచేస్తున్న భారత ప్రభుత్వ అనుబంధ సంస్థ క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సిమెంట్ నాణ్యత పటిష్ఠతపై అవగాహన పోటీ నిర్వహించగా.. ఈ పోటీల్లో పాల్గొన్న మైహోమ్ క్వాలిటీ విభాగం ఉద్యోగుల ఉత్తమ ప్రదర్శనకు మైహోమ్ సంస్థకు రెండు అవార్డులు వచ్చాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

పేట మార్కెట్‌లో పెసర క్వింటాకు రూ.9188


పెసర్లను పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్ వేణారెడ్డి

భానుపురి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పెసర క్వింటాకు రూ.9188 ధర పలికిందని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లోకి మాడుగుల నవీన్, పెన్‌పహాడ్ మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన గుండు ఉమారెడ్డి క్వింటా పెసర్లు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ధరలు జాతీయ స్థాయి మార్కెట్ల కంటే అధిక ధరలు ఇస్తున్నామని తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కార్యదర్శి ఫసియొద్దిన్, వైస్‌చైర్మన్ గట్టు శ్రీనివాస్, డైరెక్టర్లు మాడుగుల నవీన్, ధరావత్ వీరన్న, దాసరి తిరుమలరావు, ఉప్పల సత్యనారాయణ, పచ్చిపాల వెంకన్న, అబ్దుల్ ఖరీం, ఆర్తికేశవులు ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు


యాదగిరిగుట్టలో ఉత్సవమూర్తులకు హారతి నివేదిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు కొనసాగాయి. కాగా, అనుబంధ శివాలయంలో దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కాగా స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్ర పురస్కరించుకుని గురువారం చేపట్టనున్న గిరిప్రదక్షిణలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునిత, టీస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పాల్గొననున్నారు.

పశ్చిమ రాజగోపురం నుంచి భక్తులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి భక్తులు బుధవారం నుండి పశ్చిమ రాజగోపురం నుంచి ఆలయం వెలుపలికి వచ్చేందుకు అధికారులు అనుమతించారు.

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో లక్ష్మీ నరసింహుడి నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థికి గోల్డ్‌మెడల్



విద్యార్థి కుర్రి ప్రవీణ్

హుజూర్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మఠంపల్లి మండలం చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి కుర్రి ప్రవీణ్ అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. బుధవారం ఏపీలోని గుంటూరులో గల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సౌత్ జోన్ 36వ నేషనల్ ట్రయాత్లాన్ అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్స్, లాంగ్‌జంప్, బ్యాక్‌త్రోలో గోల్డ్‌మెడల్ సాధించాడు. దీంతో గోల్డ్‌మెడల్ సాధించిన ప్రవీణ్‌ను ప్రిన్సిపాల్ దున్నా వెంకటేశ్వర్లు, పీడీ అంజనేయులు, పీఈటీ రాములు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు. ఇదిలా ఉండగా గత ఏడాది గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 35వ సౌత్‌జోన్‌లో సిల్వర్ మెడల్ సాధించగా, 36వ సౌత్‌జోన్‌లో గోల్డ్ మెడల్ పొందడం గమనార్హం. అదేవిధంగా గత ఏడాది జాతీయ స్థాయిలో జార్ఖండ్‌లోని రాంచీలో నేషనల్ అథ్లెటిక్స్ 100 మీటర్ల షాట్ రన్‌లో నేషనల్ రికార్డులో గోల్డ్‌మెడల్ సాధించాడు.

యూరియా కోసం బారులు


మోతె మండలం సర్వారం సొసైటీ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

మోతె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మోతె మండలానికి వారం రోజులుగా ఏ కేంద్రానికి యూరియా రాకపోవడంతో రైతులు అధిక ధరలకు పక్క మండలాల్లో కొనుగోలు చేస్తున్నారు. బుధవారం మోతె మండలం సర్వారం సొసైటీకి యూరియా లోడ్ వచ్చింది లోడ్ వచ్చినా సొసైటీ, వ్యవసాయ అధికారులు టోకెన్లు ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు వరుసల లైన్‌కట్టించి, ఒక్కొక్కరికి ఒక్కో బస్తాను అందజేశారు. లోడ్ మాత్రమే రావడంతో వెనక లైన్‌లో ఉన్న సుమారు 500 మందికి యూరియా అందలేదు. మోతె గ్రోమోర్, సిరికొండ సొసైటీ, సర్వారం సొసైటీల ఆధ్వర్యంలో యూరియా అందించాల్సి ఉన్నా వారం రోజులుగా రాకపోవడంతో రైతులు ఆందోళనచెందుతున్నారు.

ఎండ.. వాన.. బతుకమ్మ


ఈ నెల 21న.. భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఈ నెల 21న.. వానకు తడుస్తూ..


ఈ నెల 24న.. ఎండకు ఎండుతూ...

ఎంగిలిపూలతో ప్రారంభమైన బతుకమ్మ ఆడిపాడి నిమజ్జనం చేయకుండా అక్కడే వదిలి వెళ్లారు. అయితే రోజువారీగా భువనగిరి మునిసిపాలిటీ, మెప్మా ఆధ్వర్యంలో బతుకమ్మ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అయితే ఆడిపాడి బతుకమ్మను ప్రతీరోజు నిమజ్జనం చేయకుండానే అక్కడే మైదానంలో వదిలివేయడంతో నాలుగు రోజులుగా ఎండకు ఎండి... వానకు తడుస్తూ ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు బతుకమ్మలను నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ యాదాద్రి

ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా భానుచందర్

ఆలేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనుపాక గ్రామానికి చెందిన మామిడాల భానుచందర్‌ను వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి కమిటీకి ప్రభుత్వం రాష్ట్ర కన్వీనర్‌గా నియమించింది. ఈ కమిటీలో చైర్మన్‌గా ఎమ్మెల్యే కె.శంకరయ్య, కో చైర్మన్‌గా ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వైస్ చైర్మన్‌గా ముప్పారపు నర్సింహ, కొన్నె సంపత్, దుబ్బాక రమేష్, బండిరాల రమేష్ ఎన్నిక కాగా మరో 20 మందికిపైగా కన్వీనర్‌లుగా నియమించింది.

యాదగిరికొండపై ఫైర్ మాక్ డ్రిల్

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి పుణ్యక్షేత్రంలో బుధవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాల నివారణ, రక్షణపై అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్ని ప్రమాద సమయంలో జాగ్రత్తలు, మెలుకువలపై భక్తులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కాగా, గుండెపోటుతో కుప్పకూలిపోయిన వ్యక్తులకు సీపీఆర్‌తో ప్రాణాలను రక్షించే విధానాన్ని తెలియజేశారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

భువనగిరిటౌన్/ భువనగిరి గంజ్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధక్షుడు పూస శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యమకారుల సంఘం నాయకులు కోడిమాల కృష్ణయ్య, వినోద్‌కుమార్, బాలమల్లేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీని రద్దు చేయాలి



ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న గ్రామ నాయకులు

మోత్కూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొడిచేడు గ్రామ ఇందిరమ్మ కమిటీని రద్దు చేసి, అన్ని పార్టీలకు ప్రాతినిత్యం కల్పించేలా నూతన కమిటీని ఏర్పాటు చేయాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు దీటి సందీప్, మరికొందరు గ్రామ నాయకులు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీ అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు వచ్చేలా చేసిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. వెంటనే ఆ కమిటీని రద్దు చేసి, అన్ని పార్టీలకు ప్రాతినిత్యం ఉండేలా నూతన కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వల్లమల్ల రవి, రాచ కనకయ్య, జిట్ట వెంకటేష్, గౌతమ్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

మోత్కూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మోత్కూరు తాలూకా యూనిట్ బుధవారం వారి సంఘం కార్యాలయంలో రానున్న మూడేళ్ల కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గార్లపాటి సోమిరెడ్డి, అధ్యక్షుడిగా బద్దం యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆకవరం వల్లభాయ్, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.రాజబోస్, ఉపాధ్యక్షులుగా టి.మనోహరాచారి, ఎస్.యాదగిరిలక్ష్మీ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బి.రాంరెడ్డి, పి.నర్సయ్య, కోశాధికారిగా వారాల యాదగిరి, ప్రచార కార్యదర్శిగా బి.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రతినిధులుగా ఎ.వెంకట్‌రెడ్డి, ఎస్.భాస్కరాచారిలను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం పదవీ ప్రమాణ స్వీకారం చేసింది.

పోరాటాలతోనే గీతకార్మికుల సమస్యలు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న జయరాములు

ఆత్మకూరు(ఎం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాలతోనే గీతకార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు అన్నారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కల్లు గీత కార్మిక సంఘం మండల నాలుగో మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా గీతకార్మికులను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తున్నారు తప్ప, వారి సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. గీతకార్మికులు ఒక్కటై ఉద్యమిస్తే తప్ప బతుకులు బాగుపడే అవకాశం లేదన్నారు. అనంతరం కల్లు గీత కార్మిక సంఘం నూతన మండల కమిటీ అధ్యక్షుడిగా గడ్డం దశరథ, గౌరవాధ్యక్షుడిగా పంజాల నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా పొన్నగాని జహంగీర్, ప్రధాన కార్యదర్శిగా గుండెగాని అయిలయ్య, కోశాధికారిగా ఎరుకల పాపయ్యను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాగీరు కృష్ణయ్య, కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ప్రతినిధి నాతి గణేష్, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ, నాయకులు బీ. చందర్, డి.వెంకటేష్, సీహెచ్.మల్లేష్, పి.వెంకటేశం, లోడి శ్రీను, నాతి రాజు, యాదగిరి, గణేష్. కృష్ణమూర్తి పాల్గొన్నారు.

తెలంగాణ సంచార జాతులను ఆదుకోవాలి



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సంచార జాతులను ప్రభు త్వం ఆదుకోవాలని భూదాన్ పోచంపల్లి మండల తెలం గాణ సంచార జాతుల సంఘం అధ్యక్షుడు చెన్న బత్తిని బుడ్డ యాదగిరి కోరారు. బుధవారం పట్టణం లో మండల సంచార జాతుల సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చెన్నబత్తిని బుడ్డ యాదగిరి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంచార జాతులను ఆదరించాలని కోరారు. కార్యవర్గంలో నూతన అధ్యక్షుడిగా బుడ్డ యాదగిరి, మహిళా అధ్యక్షురాలుగా చెన్నబత్తిని కాంతమ్మ, ఉపాధ్యక్షులుగా పొవానం శ్రీనివాస్, పర్వతం రమేష్, ప్రధాన కార్యదర్శిగా సూని సతీష్, కోశాధికారిగా కంసాని యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సరికొండ రవితేజ, గౌరవాధ్యక్షులుగా పర్వతం రంగయ్య, రేవల్లి సాలయ్య, పర్వతం నర్సింహ, చెన్నబత్తిని ఆనంద్, అశోక్ మల్లారి, సంయుక్త కార్యదర్శిగా చెన్నబత్తిని సారయ్య, యూత్ అధ్యక్షుడిగా పిన్నపురిళ్ల సమ్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పండుగలకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి

ఆలేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ, దసరా పండుగల కోసం తమ స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు ముందు జాగ్రత్తలు పాటించాలని ఆలేరు సిఐ యాలాద్రి కోరారు. బుధవారం స్థానిక పట్టణంలోని బృందావన్ కాలనీలో ఆయన పోలీసులతో పర్యటించారు. సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పట్టణాలు, గ్రామాలకు వెళ్లేవారు ఇంట్లో విలువైన బంగారం, వెండి, ఆభరణాలు, నగదును దాచి వెళ్లవద్దని, బ్యాంకు లాకర్లలో పెట్టి వెళ్లాలని సూచించారు. వెళుతున్న సమాచారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలపాలన్నారు. అప్రమత్తంగా ఉండకపోతే చోరీలు జరిగే అవకాశాలు ఉంటాయని తెలిపారు. కాలనీలో కొత్త వ్యక్తులు సంచరిస్తే ప్రజలు వారిని పట్టుకుని నిలదీయాలని సూచించారు. అనుమానం కలిగితే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. చోరీల నివారణకు కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎస్ఐ వినోద్ కుమార్, పలువురు కానిస్టుబుళ్లు ఉన్నారు.

శిథిల ట్యాంకుతో పొంచి ఉన్న ప్రమాదం



ట్యాంకు పెచ్చులూడుతున్న దృశ్యం



రాజాపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజాపేట మండలం నెమిల గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీంతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు, విద్యార్థులు దిన దిన గండంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. గ్రామంలో నీటి సమస్యను తీర్చేందుకు 1992 లో 60 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకును నిర్మించగా, అప్పటి హోం మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రారంభించారు. కాగా అప్పటి నుంచి గ్రామానికి నల్లా నీటిని ఇదే ట్యాంకు నుంచి సరఫరా చేశారు. మిషన్ భగీరథ రావడంతో అదనపు ట్యాంకుల నిర్మాణం జరగడంతో ఏడు ఏళ్లుగా ట్యాంకును వాడకుండా వదిలి వేయడంతో నిరుపయోగంగా మారింది. ట్యాంకు శిథిలావస్థకు చేరి పిల్లర్లు, శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి పిల్లర పైనున్న సిమెంట్ రాలిపోయి ఇనుప చువ్వలు తేలి తుప్పుపట్టిపోయి పూర్తిగా దెబ్బతిన్నాయి. ట్యాంకు సమీపంలో నివాస గృహాలు, అంగన్‌వాడి కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇక్కడి నుంచే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్ళే దారి ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నిత్యం వెళుతుంటారు. శిథిలావస్థలో ఉన్న ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని ఎప్పుడు ఏ ప్రమాదం ముంచకొస్తుందోనని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. పొంచి ఉన్న ప్రమాదంతో ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ట్యాంకును తొలగించేందు కు గ్రామస్థులు ఏడాది క్రితమే గ్రామసభలో తీర్మానం చేసి అధికారులకు అందజేశారు. అయినప్పటికి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని,సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వెంటనే నిరుపయోగంగా ఉన్న ట్యాంకు ను తొలగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భయంగా గడుపుతున్నాం



శిథిలావస్థకు చేరిన ట్యాంకు పక్కనే ఉంటున్నాం.మేము పిల్లలు అక్కడి నుంచి వివిధ పనుల కోసం వెళ్ళాల్సివస్తుంది. ట్యాంకు ఎప్పుడు కూలి మా ఇంటి మీద పడుతుందోనని భయంగా ఉంది. గాలి దూమారం వచ్చినప్పుడు ఊగిపోతుంది. వెంటనే తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

-డొంకెన లావణ్య, నెమిల గ్రామస్థురాలు

చర్యలు తీసుకుంటాం

ట్యాంకును తొలగించేందుకు గ్రామస్థులు తీర్మానించి, ఆ కాపీని అందిస్తే చర్యలు తీసుకుంటాం. క్వాలిటీ కంట్రోల్ అధికారులు వచ్చి నాణ్యతను పరిశీలించిన తర్వాత ఉన్నతాధికారుల నుంచి అదేశాలు అందిన వెంటనే తొలగిస్తాం.

-వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, రాజాపేట

ఆర్థిక సహాయం అందజేత

వలిగొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరూరు గ్రామానికి చెందిన ఎర్ర కమలమ్మ వయోభారంతో మృతి చెందింది. ఆమె కుటుంబసభ్యులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, ముత్యాలు, కరుణాకర్, అంజయ్య, మల్లేశం, బాల్‌రాజు, మల్లయ్య, రాములు పెంటయ్య, నరేష్, నారాయణ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దసరా దుస్తుల పంపిణీ

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా పిలాయిపల్లి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు బుధవారం మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పడాల సతీష్‌చారి నూతన వస్త్రాలను కానుకగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అందేకర్ రామ్‌లాల్, ఎండీ శాబేర్‌ఖాన్, లింగాల సురేష్, అందెల రాజు, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు దోసపాటి శ్రీరామ్, యూత్ కార్యదర్శి గడ్డం బిట్టు, బందారపు అఖిల్, బండిగార్ సిద్ధు, బందారపు సన్ని, బందారపు రాకేష్, బొడిగె ఆర్యన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితవైద్య శిబిరం



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరంలో పలు అనారోగ్య సమస్యలపై వచ్చిన 185మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక వైద్యులు సుమంగళి, అక్షిత, సౌజన్య, సాగరిక, స్థానిక మెడికల్ ఆఫీసర్ పావని, సీహెచ్‌వో వెంకటేశ్, వైద్య బృందం, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నేడు మోత్కూరులో..

మోత్కూరు : స్వస్థ్ నారి, సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మోత్కూరు పీహెచ్‌సీలో మహిళలకు చర్మ, దంత, సైక్రియాటి, ఈఎన్‌టీ స్పెషలిస్టుల చేత ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

రామన్నపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వెల్లంకి గ్రామంలో డా. నకిరేకంటి అశోక్ తన ఇంట్లో ఏర్పాటు చేసిన బుద్ధ అంబేడ్కర్ గ్రంథాలయానికి బుధవారం విపంచి ఫౌండేషన్ సంస్థ 100 పుస్తకాలను సంస్థ గౌరవ సలహాదారులు విశ్రాంత ఉపాధ్యాయులు అందోజు నాగ భూషణం, విపంచి ఫౌండేషన్ చైర్మన్ గ్రామీణ గ్రంథాలయ ఉద్యమకారుడు అనుముల శ్రీనివాస్ సంయుక్తంగా బహూకరించారు. పుస్తక పఠనం పెంపొందించే లక్ష్యంతో తన స్వంత ఇంటిలో గ్రంథాలయం ఏర్పాటు చేసి సమాజానికి విజ్ఞానం అందించాలనే తపనతో డాక్టర్ నకిరేకంటి అశోక్ పని చేయడం అభినందనీయమని అందోజు నాగ భూషణం అన్నారు. కార్యక్రమంలో జ్యోతిష పరిశోధకులు కూరెళ్ల నరసింహచారి, వెలకుర్తి చంద్రశేఖర్, ప్రజాగాయకులు నకిరేకంటి సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మద్దిలేటి పసుపుల పిలుపునిచ్చారు. భూదాన్‌పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 మరియు యూనిట్ 2 ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామంలో ప్రత్యేక ఎన్ఎస్ఎస్ సేవాశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ బి సురేష్‌రెడ్డి, జలాల్‌పూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి నవీన్, స్థానిక నాయకులు పాలకుర్ల ఆగయ్యగౌడ్, గోరంటి వినయ్‌రెడ్డి, గోరంటి ప్రదీప్‌రెడ్డి, కేసారం సురేందర్‌రెడ్డి, నక్క శ్రీనివాస్‌రెడ్డి, శాపాక రాజు, గుండ్ల మహేష్, మహంకాళి వంశీ, కాలేజీ స్టూడెంట్ కౌన్సిలర్ సంతోష్‌కుమార్, అధ్యాపకులు తులసి, రాజేశ్వరమ్మ, శివశంకర్‌గౌడ్, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, రేణుకాదేవి, స్వాతి, చందన, ప్రవీణ్‌కుమార్, జ్యోతి, సాయివర్ధన్ పాల్గొన్నారు.

కబడ్డీ రాష్ట్ర పోటీలకు తరలిన కబడ్డీ జట్లు



కబడ్డీ బాల, బాలికల జట్లు

ఆలేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లా ముక్కల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ జూనియర్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాలో ఇటీవల ఎంపిక చేసిన బాల బాలిక జట్లు బుధవారం బయలుదేరి వెళాయి. ఈ జట్లకు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు క్రీడా దుస్తులు బహూకరించారు.

అమరుల ఆశయాలు సాధించాలి



పాష చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆలేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సాధనకు అనేక పోరాటాలు చేపట్టి అశువులు బాసిన అమరవీరుల ఆశయాలు సాధించాలని న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్ కోరారు. బుధవారం ఆలేరులోని న్యూడెమోక్రసి కార్యాలయంలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ముక్తార్ పాష ఐదో వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడారు. అమరుల ఆశయాలు సాధించినప్పుడే వారికి నిజమైన నివాళులర్పించిన వారమవుతామని అన్నారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులు అర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన జీవితాన్ని విప్లవానికి అంకితం చేసిన ఆదర్శ విప్లవ కమ్యూనిస్టు వాది ముక్తార్ పాషన్న అని కొనియాడారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసి ప్రజాసంఘాలకు చెందిన జిల్లా డివిజన్ కమిటి నాయకులు మామిడాల భిక్షపతి, అడవయ్య, బేజాడి కుమార్, పద్మ సుదర్శన్, గడ్డం నాగరాజు, రాజయ్య, రాఘవరెడ్డి, యాకయ్య, భాను, కొమరయ్య, శ్రీశైలం, భర్మాబాబు, శ్రీను, పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆలేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆలేరు మునిసిపాలిటీ పరిధిలోని బహదూర్‌పేటకు చెందిన నీలం భాస్కర్ తీవ్ర అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కాంటెస్ట్ కౌన్సిలర్ అంగడి అంజనేయులు బుధవారం పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. భాస్కర్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. అతని కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండదండగా ఉంటుందని తెలిపారు. ఆపద సమయంలో ఆదుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మట్టిపల్లి శ్రీనివాస్, సీనియర్ నాయకులు మట్టిపల్లి సిద్దిమల్లయ్య, సిద్దిరాజు, పల్లె శ్రీనివాస్, వస్పరి నర్సయ్య, పరుష నరేష్, వినయ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా: ర్యాకల



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

భువనగిరి రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు అండగా ఉండి ఆర్థిక చేయూతనందిస్తున్నట్లు సామాజిక వేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాజ్‌పూర్‌కు చెందిన మైనార్టీ దంపతులు ఎస్‌కె.అబ్బాస్‌బీ, ఎస్‌కే.జిలాని ఇటీవల మృతి చెందారు. వారికి ముగ్గురు కుమార్తెలు. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందచేశారు. కాగా భవిష్యత్తులో ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. ఇదే గ్రామానికి చెందిన సంగ రాజు లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల నగదు ఆర్థిక సాయాన్ని అందచేసి భవిష్యత్తులో కూడా ఆర్థిక చేయూత ఇస్తానని భరోసా ఇచ్చారు.

మదర్ డెయిరీ డైరెక్టర్ పాండుకు ఉత్తమ అవార్డు



ఉత్తమ అవార్డును అందుకుంటున్న మదర్ డెయిరీ డైరెక్టర్ కస్తూరి పాండు

భువనగిరి రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం బస్వాపురం పాల సొసైటీ చైర్మన్, మదర్ డెయిరీ డైరెక్టర్ కస్తూరి పాండు ఉత్తమ అవార్డును అందుకున్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా ముల్కనూరులో మహిళ డెయిరీ సంస్థలో నిర్వహించిన ఎన్‌డీడీబీ 60వ వార్షికోత్సవ కార్యక్రమంలో అత్యధిక పాలు ఉత్పత్తి గావించినందుకు గాను విజయడెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఎన్‌డీడీబీ ప్రతినిధి శ్రీధర్, ముల్కనూరు డెయిరీ చైర్మన్ ధన శ్రీ, భువనగిరి పాలశీతలీకరణ మేనేజర్ పి.బలరాం, కాటిక జంగయ్య చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు నిర్మించాలి

రామన్నపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శోభనాద్రిపురం గ్రామంలో ఆసిఫ్ నెహర్ బ్రిడ్జిపై ఇరువైపులా రోడ్డు నిర్మాణం చేసి, ప్రజల సమస్య పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో బ్రిడ్జి వద్ద నిరసన తెలిపి మాట్లాడారు. మూడు సంవత్సరాల క్రితం నూతన బ్రిడ్జి నిర్మాణం చేసి, ఇరువైపులా సీసీ నిర్మాణం చేయకపోవడంతో పోసిన మట్టి పూర్తిగా కొట్టుకుపోయి, రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిందని అన్నారు. ఇరువైపులా సీసీ రోడ్డుకు నిధులు విడుదల చేసి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యురాలు బొడిగ రజిత, శాఖ కార్యదర్శి గోగు లింగస్వామి, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు బొడిగె వెంకటేశం, మాజీ వార్డు సభ్యులు ఎర్ర సాయిలు, జంగిలి కుమార్, ముక్కాముల మత్స్యగిరి, ఎర్ర బిక్షపతి పాల్గొన్నారు.

33కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటును విరమించుకోవాలి



విద్యుత్‌శాఖ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న వర్తక సంఘం నాయకులు

రామన్నపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట నుంచి అరూరు వరకు ఏర్పాటు చేయబోతున్న ప్రతిపాదిత 33కేవీ విద్యుత్ లైన్ స్థానిక సుభాష్ విగ్రహం నుంచి పట్టణం మీదుగా ఏర్పాటు చేయవద్దని వర్తక సంఘం సభ్యులు కోరారు. ఈమేరకు బుధవారం విద్యుత్ శాఖ ఏడీకి, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఉన్న ప్రతిపాదన సబ్ స్టేషన్ నుంచి సింగిల్ విండో కార్యాలయం వెనుకభాగం నుంచి నీర్నెంల రోడ్డు వరకు ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణం మీదుగా ఇప్పటికే రోడ్డు ఇరుకుగా ఉన్నందున పెద్ద పెద్ద టవర్ల నిర్మాణంతో ఇండక్షన్ వచ్చే ప్రమాదం ఉందని, ఎట్టి పరిస్థితుల్లో పట్టణం మీదుగా విద్యుత్ లైన్ వద్దని కోరారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు కన్నెకంటి వెంకటేశ్వచారి, ప్రధాన కార్యదర్శి వహీద్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దుర్గమ్మ, బతుకమ్మ వేడుకలు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రి, బతుకమ్మ వేడుకలు భువనగిరిలో ఉత్సాహంగా సాగుతున్నాయి. అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారికి పూజలు చేశారు. జిల్లా స్థాయి బతుకమ్మ వేడుకలలో సంక్షేమ, విద్యుత్, మెప్మా శాఖల మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. అలాగే పట్టణ వ్యాప్తంగా బతుకమ్మ సందడి నెలకొన్నది.

బీబీనగర్: వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో, ఎంప్లాయిస్ కాలనీలోని హారిక స్కూల్ రోడ్డులో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను బుధవారం పట్టణ ప్రముఖులు దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన వితరణ కార్యక్రమాన్ని మాజీ జడ్పీటీసీ గోళి ప్రణీత పింగల్ రెడ్డి దంపతులు , కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్ ప్రారంభించారు.

మోత్కూరు : మోత్కూరులో యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవీ మండపం వద్ద నిర్వహించిన పూజల్లో ఎడ్ల ఉపేందర్, అన్నెపు గోపి, ఎడ్ల శేఖర్, అవిశెట్టి కిరణ్, రఘు, వర్షిత్, దీపు, రాఖి, ఆర్యవైశ్య భవన్‌లోని దేవీ మండపం వద్ద నిర్వహించిన పూజల్లో సంఘం అధ్యక్షులు మొగుళ్లపల్లి సోమయ్య-ధనమ్మ, చంద్రశేఖర్-శ్రావణి, సోమ వెంకటేశ్వర్లు-కవిత, కార్తీక్-మమత, బస్స శ్రీనివాస్ పాల్గొన్నారు.



భువనగిరిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భువనగిరి రూరల్: భక్తి, నిష్టతో పూజిస్తే అష్టైశ్వర్యాలు సద్దిస్తాయని సిద్దగురు రమణానంద మహర్షి ఉద్బోదించారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి రమణేశ్వరంలోని శివశక్తి శిర్డీసాయి అనుగ్రహ పీఠంలో రమణానంద మహర్షి ఆధ్వర్యంలో చంద్రగంటా దేవి , భువనేశ్వరి దేవి , కౌమారిమాతృకళ, ఆరాధన పూజలు , శత్రునాశన, దృష్ట శక్తుల నివారణ హోమ పూజలు ఘనంగా నిర్వహించారు.



దండుమల్కాపురంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

వలిగొండ: మండల కేంద్రంలోని హరిహర త్రిశక్తి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్: మండలంలోని దండుమల్కాపురంలో శ్రీ భవాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గాదేవి వద్ద మహిళలు ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్.సులోచన, విడుదల వనజ, ఎం.పారిజాత, అఖిల ఉన్నారు.

పరిషత్.. పంచాయతీలో.. ఏది ముందు

(5వ పేజీ తరువాయి)

ఎదురుచూస్తున్నారు. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున..., దీని ద్వారా అధికార పార్టీకి ఈ ఎన్నికల్లో పూర్తి లబ్ధి చేకూరనుందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో మెజార్టీ జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు కైవసం చేసుకోవాలంటే జడ్పీటీసీలు, ఎంపీటీసీలు అధిక స్థానాల్లో గెలుచుకునేందుకు వీలుగా ముందుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. వారంలోగా నోటిఫికేషన్ వెలువడితే..., మూడువారాల వ్యవధిలో రెండు విడతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పూర్తిచేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

కొన్ని రోజుల వ్యవధిలోనే పంచాయతీ ఎన్నికలు

ప్రభుత్వం జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు పూర్తి చేసిన తర్వాతే గ్రామపంచాయతీ ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. పరిషత్ ఎన్నికలు ముగిసిన కొన్ని రోజుల వ్యవధిలోనే గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి..., ఆ తర్వాత మూడు వారాల వ్యవధిలోనే ఈ ప్రక్రియను ముగించాలని భావిస్తున్నట్లు సమాచారం. పరిషత్ ఎన్నికలు ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ సాధ్యం కాని పక్షంలో కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇంతవరకు జరిగిన కసరత్తుకు సంబంధించిన వివారాలను తెలియజేసి, మరింత సమయం కోరే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.